క్రీడలతో శారీరక దృఢత్వం: డీఈవో

వెల్దుర్తి, నవంబర్ 24: క్రీడలతో శారీరక ధృడత్వం కలుగుతుందని డీఈవో రాధాకిషన్ అన్నారు. మాసాయిపేటలో రెండు రోజుల పాటు నిర్వహించిన 9వ అంతర్ జిల్లాల బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా డీఈవో రాధాకిషన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డితో కలిసి గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. మొదటి స్థానంలో నిజామాబాద్, రెండో స్థానంలో మెదక్, మూడో స్థానంలో మంచిర్యాల జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి క్రీడలు ముఖ్యమని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు.

వెల్దుర్తిలో గెలుపొందిన జట్టుకు బహుమతిని అందజేస్తున్న డీఈవో రాధాకిషన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

మహిళా కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

పాపన్నపేట, నవంబర్ 24: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 4న మహిళా కబడ్డీ క్రీడాకారుల జిల్లా జట్టు ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్, సభ్యుడు రవి ప్రకటనలో తెలిపారు. 4న మెదక్ మండలం మచవరం కల్పవన్ వెంచర్‌లో ఈ ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9010735121 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 24: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను అండర్-14 బాలబాలికలకు మెదక్‌లోని పీఎన్ఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి వంద మంది క్రీడాకారులు, 20 మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజనాలు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

ఏడుపాయల్లో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు

ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో భక్తులు

(ఇన్‌సెట్‌లో) పూజలందుకుంటున్న దుర్గామాత అమ్మవారు

పాపన్నపేట, నవంబర్ 24: పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల్లోని వనదుర్గామాత సన్నిధిలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తుల సందడి నెలకొన్నది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఒడిబియ్యం, తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో చంద్రశేఖర్, సిబ్బంది ఏర్పాట్లుచేశారు. వేదపండితులు పూజలు నిర్వహించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పాపన్నపెట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బందోబస్తు చేపట్టారు.

ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య

నర్సాపూర్ కోర్టులో ఈ సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య

నర్సాపూర్, నవంబర్ 24: కక్షిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య సూచించారు. ఆదివారం నర్సాపూర్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య ఈ సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సేవ కేంద్రాలతో కక్షిదారులు, న్యాయవాదులు కోర్టు వెలువరించిన తీర్పుల ధ్రువీకరణ పత్రాలు, జమానతులను కృత్రిమ మేధస్సు ద్వారా పొందవచ్చన్నారు. కక్షిదారులు కేసుల స్థితిగతులు, తదిపరి విచారణ, తేదీ సంబంధిత విచారణ స్వీకరించవచ్చని తెలిపారు. ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ సులభతరం అవుతుందన్నారు. ట్రాఫిక్ చలాన్లు, చిన్న నేరాలకు సంబంధించి ఫైన్ చెల్లింపులను ఆన్‌లైన్‌లో కట్టేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ సేవ కేంద్రాలతో ఇతర సేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సహాయ న్యాయవాది సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సూపరింటెండెంట్ పద్మావతి, న్యాయవాదులు ప్రభు, సాయిరాం, కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

నిజాంపేట నుంచి పాదయాత్రగా వెళ్తున్న పిల్లి సుధాకర్

నిజాంపేట, నవంబర్ 24: హక్కుల కోసం మాలలందరూ ఐక్యంగా పోరాడాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన మాలల మహాపాదయాత్ర ఆదివారం నిజాంపేట మండలం నుంచి బయలుదేరింది. వర్గీకరణ పేరుతో రాజకీయం మానుకోవాలని, లేని పక్షంలో మాలలంతా మోదీకి గుణపాఠం చెపుతామన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సింహగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యుడు ర్యాకం శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడు సంజీవ, నిజాంపేట మండల గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు రాజయ్య, చంద్రం తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ సబబు కాదు

రామాయంపేట, నవంబర్ 24: ప్రభుత్వం చేపడుతున్న ఎస్సీ వర్గీకరణ సబబు కాదని మాల, మాదిగలంతా ఒక్కటేనని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. మాల మహానాడు పాదయాత్ర రామాయంపేటకు చేరుకున్నది. రామాయంపేటలోని మెదక్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక మాస పూజలు

నార్సింగి మండలంలోని జెప్తి శివునూర్‌లో ఉన్న శివాలయంలో సత్యనారాయణ వ్రత పూజలు చేస్తున్న భక్తులు

చేగుంట, నవంబర్ 24: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని చేగుంట, నార్సింగి మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో ఆదివారం సామూహిక వ్రతాలు, అభిషేకాలు చేశారు. నార్సింగి మండలంలోని జప్తి శివునూర్ శివాలయంలో స్వామి వారికి వివిధ రకాల పంచామృతాలతో అభిషేకం చేశారు. దీంతో పాటు ఆలయంలో భక్తులు సత్యనారాయణ వ్రతాలు చేశారు. అనంతరం వనభోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి విద్యా కమిటీ మాజీ చైర్మన్ గాండ్ల గోవర్ధన్ నిర్మల దంపతులు, ఇబ్రహీంపూర్ సహకార సంఘం సీవో కరణం సంతోష్‌కుమార్, గవ్వలపల్లి ఏఈవో శ్యాంకుమార్, ప్రణయ్, కంప్యూటర్ సెంటర్ నిర్వాహకులు పవన్‌కుమార్, నవీన్, శబరిమాత భక్తులు రావుల రామచంద్రం, శ్రీకాంత్, కృష్ణ తదితరులుపాల్గొన్నారు.

తప్పుల్లేకుండా వివరాలు నమోదు చేయాలి: ఆర్డీవో

సర్వే డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

చిన్నశంకరంపేట, నవంబర్ 24: సర్వేలో తప్పుల్లేకుండా వివరాలను నమోదు చేయాలని ఆర్డీవో రమాదేవి సూచించారు. ఆదివారం చిన్నశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో కుటుంబ సర్వే డాటా ఎంట్రీని ఆమె పరిశీలించారు. ఎక్కడైనా పొరపాట్లు ఉంటే ఎన్యూమరేటర్లను సంప్రదించాలన్నారు. అనంతరం గవ్వలపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. లారీల కొరత లేకుండా చూడాలని, రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు, సంతోష్, యోగేశ్, లక్ష్మణ్, అరవింద్, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

బ్యాగులను పంపిణీ చేస్తున్న సగర సంఘం నాయకులు

చిన్నశంకరంపేట, నవంబర్ 24: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సగర సంఘం జిల్లా కోశాధికారి ధ్యాప బాలకిషన్ సూచించారు. ఆదివారం మండలంలోని భాగీర్థిపల్లి గ్రామంలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మరక సురేశ్ సగర్, నవీన్ సగర్ సౌజన్యంతో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏగొండ , విశ్వనాథ్, గణేశ్, సిద్దిరాములు, గంగాధర్, కిషన్, వెంకటేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న అయిత పరంజ్యోతి

చేగుంట, నవంబర్ 24: చేగుంట పట్టణానికి చెందిన కర్రె శకుంతల ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబానికి జిల్లా వాలీబాల్ ఆసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి ఆదివారం పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో చేగుంట సొసైటీ డైరెక్టర్ అయిత రఘురాములు, కర్రె సిద్దిరాములు, భిక్షపతి, న్యాలపల్లి సతీశ్, స్టాలిన్, నర్సింహులు తదితరులున్నారు.

యువతి అదృశ్యం

వీణ

శివ్వంపేట, నవంబర్ 24: యువతి అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నాపూర్ గ్రామానికి చెందిన మర్కంటి వీణ ఈ నెల 23న తల్లిదండ్రులతో పాటు పొలం వద్దకు వెళ్లింది. మధ్యాహ్నం పొలం నుంచి వీణ ఇంటికి తిన డానికి వెళ్లింది. తల్లిదండ్రులు ఇంటికి వెళ్లి చూడగా అక్కడ లేదు. దీంతో చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. వీణ తండ్రి రాకేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఏఎస్సై తెలిపారు.

రాజ్యాంగంతోనే బానిస బతుకులకు విముక్తి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మెదక్ అర్బన్, నవంబర్ 24: రాజ్యాంగం ద్వారానే బానిస బతుకులకు విముక్తి అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 75 ఏండ్ల భారత రాజ్యాంగ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వివక్ష నేరాలకు భారత రాజ్యాంగం శిక్షలు వేస్తుందన్నారు. దేశానికి దక్షిణ భారత దేశంలో రెండో రాజధాని ఉండాలని చెప్పిన బాబా సాహెబ్ ముందు చూపునకు నిదర్శనమన్నారు. రాజ్యాంగంతో విద్య, ఉద్యోగాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాది దేవరాజ్‌గౌడ్, టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్, జెల్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహారుద్ర పారాయణానికి ఎంపీకి ఆహ్వానం


ఎంపీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

టేక్మాల్, నవంబర్ 24: టేక్మాల్‌లోని వేంకటేశ్వర ఆలయంలో డిసెంబర్ 1న మహా రుద్ర పారాయణానికి రావాలని కోరుతూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌కు ఆదివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మల్లిక, మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు విజయ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, సంతోష్ తదితరులున్నారు.

ఆటో, కారు ఢీకొని పలువురికి గాయాలు

నర్సాపూర్, నవంబర్ 24: ఆటోను వెనక నుంచి కారు ఢీకొన్న ఘటన ఆదివారం నర్సాపూర్, హైదరాబాద్ జాతీయ రహదారిలోని అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆదివారం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన శివాగౌడ్, సువర్ణ, సంజన మరో ముగ్గురు ట్రాలీ ఆటోలో ఏడుపాయల దుర్గామాత దర్శనానికి వెళ్తుండగా అటవీ శాఖ కార్యాలయం ఎదుట వెనక నుంచి కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో డివైడర్‌ను ఢీకొన్నది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయించి, అనంతరం హైదరాబాద్‌కు తరలించారు.

వృద్ధులను గౌరవించాలి

వృద్ధుల దినోత్సవంలో పాల్గొన్న సభ్యులు

నర్సాపూర్, నవంబర్ 24: ఇంట్లో ఉన్న పెద్దలు, వృద్ధులను గౌరవించాలని హెరిటేజ్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర స్త్రీ సేవా సంస్థ అధ్యక్షురాలు శోభ అన్నారు. ఆదివారం నర్సాపూర్ లయన్స్ క్లబ్ నిత్య జీవన యోగా సాధన సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంద జైపాల్, యోగా గురు సురేందర్‌గౌడ్, సభ్యులు చంద్రశేఖర్ గుప్తా, భిక్షపతిరెడ్డి, రమణారావు, కొండా రాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

శభాష్‌పల్లిలో ఆర్థికసాయం అందజేస్తున్న పబ్బ మహేశ్‌గుప్తా

శివ్వంపేట, నవంబర్ 24: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. మండలంలోని చండి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుమ్మరి చిత్తారి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. శభాష్‌పల్లిలో మృతిచెందిన షేక్ మొయినోద్దీన్ కుటుంబాన్ని, అనారోగ్యంతో బాధపడుతున్న మస్కురి సాయిలును పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పార్వతి సత్యం, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, భిక్షపతి, నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కుమ్మరి నర్సింలు, ఉస్మాన్, నర్సింలు, యాదగిరి, రమేశ్, స్వామి, రాజు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

విశ్వనాథ్(ఫైల్)

పెద్దశంకరంపేట, నవంబర్ 24: చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దశంకరంపేటలో జరిగింది. ఎస్ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కమలాపురం వద్ద 10 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగరి విశ్వనాథ్ (48)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హనుమాన్ గుడి వద్ద బోరుబావి తవ్వకం

రామాయంపేట, నవంబర్ 24: కోనాపూర్ పెద్ద తండాలోని హనుమాన్ గుడి వద్ద ఆదివారం బోరుబావిని పీఏసీఎస్ డైరెక్టర్ మామిడి సిద్ధరాములు తవ్వించారు.

ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మెదక్ చర్చిలో ప్రార్థనలు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 24: మెదక్ చర్చిలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ప్రార్థనల్లో భక్తులు ఏసయ్యకు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రార్థనల్లో ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య, పాస్టర్లు శ్రీనివాస్, జైపాల్, డేవిడ్ రిచర్డ్స్, గంట సంపత్, సువన్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన చైర్మన్

సర్వే పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, నవంబర్ 24: నర్సాపూర్ మున్సిపాలిటీలోని ఐదో వార్డులో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ఐదో వార్డును ఇందిరమ్మ ఇండ్లకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. పేదలకు ఇల్లు వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు.

ప్రశాంతంగా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పరీక్ష

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 24: జిల్లా కేంద్రంలోని 5 పరీక్షా కేంద్రాల్లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. 5 పరీక్షా కేంద్రాల్లో 1008 మంది విద్యార్థులకు 979 మంది హాజరయ్యారు. 29 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 97.12 శాతం నమోదయిందన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి

సత్యసాయి బాబాకు నివాళులర్పిస్తున్న సత్యసాయి భక్తులు

రామాయంపేట, నవంబర్ 24: పట్టణంలోని సత్యసాయి 99వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సదనంలో భక్తులు బాబాకు హారతి, అభిషేకాలు, మంగళహారతులు, నైవేద్యాలు అందించారు. వివేకానంద ఆవాస విద్యాలయంలోని విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు శంకరయ్యగుప్త, గౌరీ శంకర్, భానుశేఖర్, బాలకిషన్, బల్ల రాజయ్య, భూలక్ష్మి, స్నేహిత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్

మెదక్‌రూరల్, నవంబర్ 24: మండలంలోని ర్యాలమడుగు గ్రామానికి చెందిన భిక్షపతికి రూ.25వేలు, రాములుకు రూ.68 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ బోయిని ఆంజనేయులు, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సంతోష్, గోపాల్‌రెడ్డి, సిద్దు ఆదివారం అందజేశారు.

తునికి నల్ల పోచమ్మకు ప్రత్యేక పూజలు

నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న మహిళా భక్తులు

కౌడిపల్లి, నవంబర్ 24: మండలంలోని తునికి గ్రామంలో వెలిసిన నల్ల పోచమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు శివప్ప తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొయ్యగుట్ట మల్లన్నకు భక్తుల పూజలు

మల్లన్న సన్నిధిలో భక్తులు

మెదక్‌రూరల్, నవంబర్ 24: మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తులతో సందడి నెలకొన్నది. అభిషేకాలు, అర్చన, ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.

పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా దుర్గయ్య

ఆకులపల్లి దుర్గయ్య

టేక్మాల్, నవంబర్ 24: పీఆర్టీయూటీఎస్ మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కుసంగి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆకులపల్లి దుర్గయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు అమీరోద్దీన్, మండల శాఖ తరపున జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.